# ఘనంగా గ్యార్వీ ఉత్సవాలు


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: హైదర్‌నగర్ గ్రామ పరిధిలోని దర్గా వద్ద ముస్లింలు ఆదివారం గ్యార్వీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని మతాలు, కులాలు ఒక్కటే అని, మత సామరస్యంతో ముందుకు సాగాలన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ఒకరికి ఒకరు ప్రేమ, ఆప్యాయతలతో సహాయం చేసుకుంటూ దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. హైదర్‌నగర్ ప్రాంతం తనకు రాజకీయంగా పుట్టినిల్లు వంటిదన్నారు. ప్రజా ప్రతినిధిగా మొదటి ప్రస్థానం హైదర్‌నగర్‌లోనే ప్రారంభమైందని అప్పటి నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. తనను కౌన్సిలర్‌గా గెలిపించిన హైదర్‌నగర్ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. స్మశాన వాటికలకు, పాఠశాలకు, ప్రార్థనా మందిరాలకు స్థలాల కోసం భూములను కేటాయించానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మొహమ్మద్ గౌసుద్దీన్, గొట్టిముక్కల భాస్కర్‌రావు, స్థానిక నాయకులు కలీమ్, నక్క శ్రీనివాస్, న్యాయవాది శ్రీకాంత్, నర్సింగ్‌రావు, వెంకటేష్, సలీమ్, జుబేదా బేగం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# వరద ముప్పు నుంచి రక్షించండి


పట్నం మహేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వన్‌సిటీ ప్రతినిధుల బృందం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని వన్‌సిటీని వరద ముప్పు నుంచి రక్షించాలని వన్‌సిటీ డైరెక్టర్లు, రెసిడెన్షియల్ ప్రతినిధుల బృందం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతను కోరారు. ఈ మేరకు ఆదివారం వారి నివాసంలో వినతిపత్రం అందజేశారు. దీనికి సంబంధించిన ఫైల్ జీహెచ్‌ఎంసి కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని చొరవ చూపి మలేసియా టైన్‌షిప్ నుంచి వచ్చే వరదను కాలువ ద్వారా డైవర్షన్ చేయించాలని కోరారు. దీనికి వారు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వన్‌సిటి డైరెక్టర్లు సుధాకర్, వెంకీ రచ్చ, మీనా, రెసిడెంట్స్ నారాయణ రెడ్డి, కళ్యాణ్, నటరాజన్, సుదర్శన్, సత్య, రఘు, చరణ్‌రాజు, మినీ మహాపాత్ర తదితరులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో కార్తీక పూజలు



కార్తీక మాస పూజలకు సిద్ధమైన హరిహర క్షేత్రం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నాగిరెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు కృష్ణ సూరి సమక్షంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేస్తారన్నారు. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ నెల 10న ఆదివారం దాసాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, 11న ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం లక్ష దీపారాధన, 19న అర్చోత్సవం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, సాయంత్రం 6 గంటలకు సంకష్టహర చతుర్థి సందర్భంగా లక్ష్మీ గణపతికి పంచామృతాభిషేకం, 25న ప్రత్యేక అభిషేకం, త్రయోదశి సందర్భంగా సాయంత్రం నందీశ్వరునికి అభిషేకం, 29న మాస శివరాత్రి సందర్భంగా కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కల్యాణం, వన భోజనాలు, 30న స్వామివారిని భరత్‌నగర్ కాలనీ పురవీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న లయన్ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని. అందులో భాగంగా ప్లాస్టిక్ సంచులకు బదులుగా క్లాత్ బ్యాగ్‌లను వాడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ లయన్ అన్నెం కోటి రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ రైతు బజార్‌లో వినియోగదారులకు ఆయన క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెమికల్‌తో తయారు చేసిన ప్లాస్టిక్ సంచులు వాడితే వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం రైతు బజార్‌లో జనసంచారం ఉన్న చోట, ఇతర దినాల్లో ప్రభుత్వ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై కరపత్రాలు ప్రదర్శనలు, బట్టతో తయారు చేసిన సంచులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లక్ష బ్యాగులు పంచడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో అనుమల రంజిత్‌కుమార్‌రెడ్డి, లయన్ సంపత్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: ఓపెన్ జిమ్‌లు ప్రజల మానసిక వికాసం, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. సెవన్ హిల్స్ శేషాద్రిబ్లాక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు శేషాద్రి బ్లాక్ అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయన్నారు. మారుతున్న జీవన విధానంతో మానసిక ఒత్తిడితో అనేక మంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు జిమ్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయాయం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్యం బాగుంటే మనిషి ఏదైనా సాధించగలడని, ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరమన్నారు. కార్యక్రమంలో శేషాద్రి బ్లాక్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాలను తొలగించండి


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న పురంధర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు పలు సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా వినియోగదారుల అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నారు. వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కాలనీలో ఏఈ చైతన్య ఆధ్వర్యంలో చెట్ల కొమ్మల తొలగింపు, కొత్త విద్యుత్ స్తంభాలు, వివిధ కేబుల్‌లైన్లు ఏర్పాటు చేశారని, మరికొన్ని కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని, రోడ్ల వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని కోరారు. ఉషాముళ్లపూడి రోడ్డులో ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురువుతున్నాయని, అధికారులు రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, కాలనీలో కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- నిధులు లేక అభివృద్ధి కుంటుపడింది
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## బీఆర్‌ఎస్‌పై ఆరోపణలే కాంగ్రెస్, బీజేపీ లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించిన కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు వచ్చినా అండగా ఉంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు డివిజన్‌లో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు అరాచకాలకు పాల్పడుతున్నారని, హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, స్థానిక నేతలు హైడ్రాను అడ్డుపెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పదేళ్లలో రూ. వందల కోట్లతో మూసాపేట డివిజన్‌ను అభివృద్ధి చేశామని రోడ్లు, డ్రైనేజీలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వక పోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలను గెలిపిస్తే ప్రజలకు ఏమైనా న్యాయం చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై బీఆర్‌ఎస్‌ను తిట్టడమే లక్ష్యంగా చేసుకున్నారు తప్ప అభివృద్ధి పై దృష్టి సారించే ఆలోచన లేదన్నారు. పేదోళ్ల భవంతులను కూల్చడం మానేసి పేదోళ్ల కడుపులు కొట్టడానికి హైడ్రా తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా వెన్నంటి ఉంటానని, ఎవరూ భయపడవద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, జిల్లా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ రాజు కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాంట్రాక్టర్ ఆంజనేయులతో కలిసి ఆదివారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవులపల్లి కృష్ణమూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

## ఉచిత ఫ్రీజర్ బాక్స్ ప్రారంభం


ఫ్రీజర్ బాక్స్‌ను ప్రారంభిస్తున్న సత్యం శ్రీరంగం తదితరులు

బాలానగర్: బాలానగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పులి శ్రీకాంత్ పటేల్ గౌడ్ తన మిత్రుడు దివంగత బండారి రాజేష్ గౌడ్ జ్ఞాపకార్థం బాలానగర్ ప్రజల అవసరార్థం ఉచిత ఫ్రీజర్ బాక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ఫ్రీజర్ బాక్స్ బండారి రాజేష్ గౌడ్ స్వగృహంలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆదివారం టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బండారి రాజేష్‌గౌడ్ తల్లిదండ్రుల చేతుల మీదుగా ఫ్రీజర్ బాక్స్‌ను ప్రాంభించారు. కార్యక్రమంలో నాయకులు ఫాల్గుణ, సూరజ్ తివారీ, కె. రాజు, బండారి విశ్వనాథం, పుష్ప, శ్రీనివాస్, శ్రీధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

దుండిగల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గాగిల్లాపూర్ 33 కేవీ, తాండా 11 కేవీ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డి.పోచంపల్లి ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తాండా-1, గణపతి సచ్చిదానంద ఆశ్రమం, పారిశ్రామిక వాడలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



దుండిగల్: ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్సీని కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం పలువురు వివాహ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

# సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా


చెక్కు అందస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా కల్పిస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఆయన వివేకానందనగర్ డివిజన్, వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన పాపారావు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 45 వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల పక్షపాతి అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ, ఆపదలో ఉన్నవారిని ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, కాశీనాద్‌యాదవ్, ఎండి. ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి


అంజిరెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మోతీనగర్: జ్ఞానేంద్రియాల్లో కళ్లు అతి ముఖ్యమైనవని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటి హాల్‌లో ఏఎస్‌ఆర్‌నగర్ నేత్ర ఐ ఇనిస్టిట్యూట్ ఆసుపత్రి, మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ప్రతి ఆదివారం నిర్వహించే సాధారణ వైద్య శిబిరంలో పరీక్షలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరం 50 రోజుల అదుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి వారం నిర్వహించే వైద్య శిబిరానికి సహకరిస్తున్న మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షులు అంజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు బీజముల్ల నాగేశ్వరరావు సాగర్, కొల్లప్ప, కె. శ్రీలత, సత్యకుమార్, కుటుంబరావు, పి. వెంకటేష్ గౌడ్, గోపాల రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక వికాసం

కూకట్‌పల్లి: క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలోని శ్రీ పుల్లారి నారాయణదాస్ కల్యాణ మండపంలో 5వ నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ, త్వైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర, బెంగళూరు, ముంబై, తెలంగాణలోని నాగర్‌కర్నూల్, వరంగల్, పెద్దపల్లి జిల్లాల నుంచి సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షీటీం లక్ష్మీ, రుద్రమదేవి, సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి ఫౌండర్, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, బాలానగర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజ్‌పుత్, రవి, శ్రీధర్, సత్య శంకర్, మాస్టర్లు, అకాడమి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సత్యం శ్రీరంగం తదితరులు

# సమగ్ర సర్వేకు సన్నాహాలు పూర్తి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే కోసం అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. జంట సర్కిళ్ల పరిధిలోని గాజులరామారం, కుత్బుల్లాపూర్‌లలో ఇప్పటికే అధికారులు సిబ్బందిని సమాయత్తం చేశారు. ఈ నెల 6 నుంచి ఆయా సర్కిళ్లలో సర్వే నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహించారు. సర్వేలో ప్రజల నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సంబంధిత వివరాలను సేకరించనున్నారు.

**ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం..**

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో 2,16,848 నివాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కుత్బుల్లాపూర్‌లో 1,10,076, గాజులరామారంలో 1,06,772 నివాసాలు ఉన్నాయి. వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్‌లో 766, గాజులరామారంలో 712 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. ఒక ఎన్యుమరేటర్ రోజూ 10 కుటుంబాల చొప్పున 150 కుటుంబాల వివరాలను సేకరిస్తారు. ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూజర్‌వైజర్‌ను నియమించారు. ప్రతి రోజు వీరు చేసే సర్వేను ఆయన పరిశీలిస్తారు. గ్రేటర్ సిబ్బందితో పాటు అంగన్‌వాడీ, ఆశా, పాఠశాల ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా నియమించారు. సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు 56 అంశాలతో పాటు ఉప అంశాలను పూరిస్తారు. ఇందులో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు విద్య, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను నమోదు చేస్తారు. ముఖ్యంగా ఈ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర వివరాలను నమోదు చేస్తారు. సర్వేలో ఆధార్ కార్డు నమోదు తప్పనిసరి కాదని, కానీ ఆధార్ కార్డును వివరాలను వెల్లడిస్తే కలిగే లాభాలను ఎన్యుమరేటర్లు ఆయా కుటుంబ సభ్యులను వివరించనున్నారు.

## విద్యుత్ మీటర్లు బదిలీ చేయండి



వినతిపత్రం అందజేస్తున్న చిత్తారమ్మబస్తీ వాసులు

బాలానగర్: బాలానగర్ మండలం, చిత్తారమ్మ బస్తీలో విద్యుత్ మీటర్లు బదిలీ చేయాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు ఆదివారం వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ సమస్యలను విద్యుత్ శాఖ అధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. డబల్ బెడ్‌రూమ్ వాసులు తమ పేర్లతో విద్యుత్ మీటర్లను బదిలీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ పేరున విద్యుత్ మీటర్లు ఉన్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బస్తీ అసోసియేషన్ నాయకులు శాఖయ్య తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి


ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న విశ్వకర్మ సంక్షేమ సంఘం సభ్యులు

బాలానగర్: విశ్వకర్మ సంక్షేమానికి భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని బాలానగర్ విశ్వ కర్మ సంక్షేమ సంఘం సభ్యులు అన్నారు. ఈ మేరకు ఆదివారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మల సమస్యలను విన్నవించారు. సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.కార్యక్రమంలో మాధవ్, రాజేష్, అనీష్, అరుణ్, శ్రీజిత్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు ముమ్మరం


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సందీప్‌నాయక్, గోపాల్‌సింగ్ తదితరులు

మోతీనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపడుతున్న పలు సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని కూకట్‌పల్లి నియోజకవర్గ కన్వీనర్ శ్రీకర్‌రావు అన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ గణేష్ నగర్‌లో పార్టీ సీనియర్ నాయకుడు డి. సందీప్ నాయక్, డివిజన్ మాజీ అధ్యక్షుడు డి. గోపాల్‌సింగ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ చేపట్టిన సభ్యత్వాన్ని సకాలంలో పూర్తి చేసి అధిష్టానానికి సమర్పించాలని తెలిపారు. ప్రజా వ్యతిరేక పాలనపై కార్యకర్తలు నిరంతరం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రామ్‌రెడ్డి, మల్లేష, సుదర్శన్, శ్రీనివాస్, విజయ్, రంజిత్, తేజ, కిరణ్‌వర్మ, ఉదయ్‌రాజ్, శ్రీనివాస్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐస్‌క్రీమ్, జ్యూస్ ఇవ్వలేదని..

**హోటల్ వర్కర్‌పై దాడి**

కేపీహెచ్‌బీకాలనీ: ఆర్డర్ ఇచ్చినా ఐస్‌క్రీమ్ తెచ్చి ఇవ్వలేదని ఓ హోటల్ వర్కర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..కేపీహెచ్‌బీకాలనీ రెయిన్‌ట్రీ పార్కులో ఉంటున్న బెల్లంకొండ రామ్ లక్ష్మీందర్‌గౌడ్ జేఎన్టీయూ మెట్రోస్టేషన్ వద్ద ఆర్1 టిఫిన్స్, దోశ హట్ పేరిట దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 1న రాత్రి మహ్మద్ నజీర్, జుబేర్‌ఖాన్ అనే ఇద్దరు కస్టమర్లు అక్కడికి వచ్చి జ్యూస్ ఆర్డర్ చేశారు. దీంతో ఉద్యోగి వారికి జ్యూస్ తయారు చేసి ఇచ్చాడు. అయితే వారు మరో జ్యూస్‌తో పాటు ఐస్‌క్రీమ్ ఇవ్వాలని కోరాడు. అయితే అతను వారి ఆర్డర్‌ను మరిచిపోయి ఇతర పనుల్లో నిమగ్నమై ఉండటంతో ఆగ్రహానికి లోనైన వారు రాడ్డుతో అతడిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఉద్యోగిని ఆస్పత్రిలో చేర్పించిన యజమాని రామ్ లక్ష్మీందర్‌గౌడ్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని పార్కులను అభివృద్ధి చేయాలని సీపీఐ రాష్ట్ర సభ్యుడు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. ఆదివారం వారు రాజీవ్‌గృహకల్ప పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సీపీఐ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం భూ పోరాటం చేసి గుడిసెలు వేయించామన్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సీపీఐ నాయకులతో చర్చించి ప్రజలకు ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. అందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో రాజీవ్ గృహ కల్ప ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. అదే సమయంలో ప్రజల కోసం పార్కులను కూడా ఏర్పాటు చేశారని, కాలనీలోని రెండు పార్కులను అభివృద్ధి చేయాలని గత ప్రజావాణిలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

## శివారు మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి

దుండిగల్: ప్రణాళికా బద్ధంగా శివారు మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం ఆయన దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో రూ. కోటి వ్యయంతో సీఎస్‌ఆర్ నిధులతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లోనూ శివారు మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బెంబడి బుచ్చి రెడ్డి, శంభీపూర్ కృష్ణ, మురళీ యాదవ్, సింహపురి కాలనీవాసులు దేవేందర్ రెడ్డి, దశరథ్ రెడ్డి, సందీప్ రెడ్డి, మనీవర్ధన్, రవీంద్ర, సందీప్ రావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు. బౌరంపేట్ డాలర్ మిడోస్ కాలనీలో అప్రోచ్ రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఆయన హౌసింగ్ బోర్డు అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని, కాలనీలో మంజీరా, వీధి దీపాల వంటి మౌలిక వసతులు కల్పించి అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు.